# అల్పజీవి

## కొండముది శ్రీరామచంద్రమూర్తి

మూర్తికి టాటా చెబుతూ అన్నదిఅతని భార్య అరుంధతి, "జాగర్త సుమాండీ! అసలే రోజులు బాగా లేవు"

వీధిలోకి అడుగుపెట్టిన మూర్తి మొహం చిట్లించుకున్నాడు. "లక్షసార్లు చెప్పాను నీకు, బయటికి బయలుదేరేటప్పుడు అట్లా అనకే అని! నువ్వు వినవ్!"

"తప్పకుండా వింటానండీ, మీకా పరధ్యానమూ, మతిమరుపూ తప్పిపోయినప్పుడు!"

మరింకే సమయంలోనైనా అయితే భార్య మాటలకు తగిన సమాధానం చెప్పేవాడే మూర్తి, కానీ అప్పటికే తొమ్మిది దాటి ముప్పై అయిదు నిముషాలైంది. ఇంకో పదినిముషాల కల్లా అయిదో నంబరు బస్సుంది. ఏ బస్సైనా ఆలస్యం కావచ్చు కానీ, అది మాత్రం సెకండైనా ఆలస్యం కాదు. ఆ కండక్టరుకు పంక్చువాలిటీ అంటే పంక్చువాలిటీయే, యమరూలు మనిషి, బస్సులో చుట్ట, బీడీ, సిగరెట్ బంద్. మగవాళ్ళు ముందు డోర్లోంచి లోపలకెక్కడం, ఏ ఇతర నంబరు బస్సులోనైనా సాధ్యమేమోకానీ, అతగాడి అయిదో నంబరు బస్సులో మాత్రం, దట్ ఈజ్ జస్ట్ ఇంపాజిబుల్! అంతేగాదు, ఆడవాళ్ళ సీట్లల్లో మగమహారాజులు కూచోడానికి వీల్లేదు. కూచుంటే, ఒక్క అంగుళమైనా బస్సును ముందుకు పోనీడు. ఆ పంక్చువాలిటీకీ, ఆ రూల్సుకు, ఆ డిసిప్లిన్‌కు మూర్తికి ఆ బస్సంటే ఎంతో ఇష్టం. అందుకనే ఆ బస్సులోనే రోజూ ఆఫీసుకు వెళతాడు, మళ్ళీ సాయంకాలం ఆ బస్సులోనే గూడు చేరుకుంటాడు.

తొందరతొందరగా అడుగులు వేస్తున్నాడు మూర్తి. వెధవది, వీధిలో ఈ చివర వుంది తన ఇల్లు. అడ్డరోడ్డన్న మాటేకాని, అరమైలు దూరం వుంది ఈ వీధి. వేణుగోపాలస్వామి ఆలయం దాటి, చిన్నబ్బాయి కాకా హోటలు దాటి, వెంగళాంబ మర్రిచెట్టు దాటి మరో వంద గజాలు పోతేగాని మెయిన్ రోడ్డు రాదు. మెయిన్ రోడ్డుకు అవతలివైపు బస్‌స్టాప్. జమ్ములపాలెం వీరవెంకయ్యగారి కుమారుడు రొటేరియన్ పాస్ట్ ప్రెసిడెంటు సత్యనారాయణ వరప్రసాదరావుగారు తన మొదటి భార్య జ్ఞాపకార్థం కట్టించింది వుంది. దాన్ని చేరుకోవాలంటే మెయిన్ రోడ్డు క్రాస్ చెయ్యాలి.

మూర్తి హడావిడిగా రోడ్డు క్రాస్ చెయ్యబోయాడు. ఓ గంట క్రితం వాన కురిసింది. ఇంకా రోడ్డుమీద తడి ఆరలేదు. గుంటల్లో నీళ్ళు మెరుస్తున్నాయి. రోడ్డు అక్కడక్కడా జారుడుగా వుంది. జారేచోట మూర్తి అడుగు పడ్డది, జర్రున కాలు జారింది. పడబోయి, అతి కష్టం మీద నిగ్రహించుకున్నాడు. శరీరం ధనుస్సులా వంగింది. కావడబద్దకు కట్టిన రెండు తాళ్ళల్లా చేతులు గాల్లో తేలి ఆడాయి. కాళ్ళల్లో ప్రకంపనం. కళ్ళల్లో గిర్రున తిరిగిన ప్రపంచం. వెనక కీచుమంటూ ఆగిన ఓ ఖరీదైన చిన్నకారు. మీద పడబోయి అతికష్టంమీద బ్యాలెన్సు చేసుకుని ముందుకు దూసుకు పోయిన ఓ కాలేజీ స్టూడెంటు. ఎడం కాలి మీదకు ముందు చక్రం ఎక్కించేసి, బెల్లు కొట్టుకుంటూ పక్కకు తప్పించుకున్న రిక్షావాలా.

చిన్న కారులో కూచున్న పెద్ద మనిషి చిరాకు పడుతూ అన్నాడు. "ఆర్ యు బ్లయిండ్! రోడ్డు మీద అటూయిటూ చూసుకోనక్కర్లా! యాక్సిడెంట్స్ చేసేది మీరూ, ఇరుక్కొని బాధపడేది మేమూనూ?" చుట్టూ చేరిన నలుగురూ మూర్తి వేపు జాలిపడు తున్నట్టుగా చూస్తున్నారు. మూర్తికి చచ్చిన చావుగా వుంది.

"సారీ, ఐ యామ్ సో సారీ" అంటూ గబగబా అవతలికి నడిచి, బస్‌స్టాప్‌లో బయలుదేరడానికి సిద్దంగా వున్న అయిదో నంబరు బస్సులోకి ఎక్కేశాడు. కిటికీలోనుంచి అంతవరకూ అతని వేపే చూస్తున్న ఓ ముసిలావిడ అన్నది. "అదృష్టవంతుడివినాయనా, ప్రమాదం తప్పింది"

"అయినా అంత పరధ్యానం ఏమిటయ్యా!" కొంచెం పెద్ద వయస్సులోవున్న మరొకాయన కాస్త మందలింపుగా అన్నాడు.

మూర్తికి ఆ సంఘటన తాలూకు జలదరింపు ఇంకా పోలేదు. మనస్సు ఉలికి ఉలికి పడుతోంది. అసలు పొద్దుట్నించీ అతని మనసు బాధపడుతోనే వుంది. తన కలాలూ గట్రా తీయొద్దురా అంటే కిష్టిగాడు వినడు. వేలెడంత లేడు, వెధవ. వెలగబెడుతోంది సెకండ్ స్టాండర్డు. ఆ వయసుకే, ఆ క్లాసుకే తన పెన్నుతో రాస్తేకాని వాడికి రాసినట్టుగా వుండదు. పొద్దున్న తను చూడకుండా తన కలం తీశాడు. బరబరా గీకడంతో పాళీకాస్తా విరిగిపోయింది. తనకు మా చెడ్డకోపం వచ్చింది, వాడి వీపు తాషామర్పా వాయించేశాడు. తను కొట్టడం అంతా అయిపోయింతర్వాత, కిష్టిగాడ్ని అవతలిగదిలోకి తీసుకెళ్ళి, వాడికి తినడానికేదో పెట్టి సముదాయించి, ఆ తర్వాత తన దగ్గరకు మెల్లగా వచ్చి, తనకు మాత్రమే వినిపించేంత మెల్లగా అన్నది అరుంధతి, "కోపం రాదంటే చెబుతాను, అసలు తప్పు మీది కాదూ!"

"నా... దా...!?"


"ఆహా! మీదే!! ఎదురుగ్గా వాడికందేట్టుగా మీ వస్తువులు పెట్టి, తీసుకోవద్దురా అంటే, వాడెట్లా తీసుకోకుండా ఉండగలడూ?"

"అట్లా తీసుకోకుండా ఉండగల నిగ్రహమ్ వాడు అలవాటు చేసుకోగలగాలి"

ఆ మాట విని పక్కున నవ్వింది అరుంధతి. "మీ నిగ్రహమెంతో కూడా ఒకసారి గుర్తు తెచ్చుకోండి. పుట్టింటికివెళ్ళి నాలుగురోజులు ఉండేసరికి, అయిదోనాటికల్లా పరుగెత్తుకు వచ్చేవారు. మీ అబ్బాయి కాదూ వాడూ? చిన్నవాడు కాబట్టి కలం కోసం అంగలార్చాడు, పెద్దవాడైతే పెళ్ళాం కోసం బెంగపడతాడు!" అరుంధతి చేత మెత్తమెత్తగా చివాట్లుతిని, కిష్టిగాడిని మళ్ళీ మంచి చేసుకోబోయాడు మూర్తి. ఒకపట్టాన వాడు దగ్గరకు రాలేదు.

"ఐస్‌ఫ్రూట్ తెచ్చిపెట్టనా సాయంత్రం!"

**మూర్తికి ఆ సంఘటన తాలూకు జలదరింపు ఇంకా పోలేదు. మనస్సు వులికి వులికి పడుతోంది. అసలు పొద్దుట్నించీ అతని మనసు బాధపడుతూనే వుంది. వేలెడంత లేడు — కిష్టిగాడు తన మాట వినడు.**




వాడు "ఊ..." అనలేదు.

"అమ్మా, నువ్వూ, నేనూ సాయంత్రం సినిమాకు వెళ్దాం, డిష్కుం డిష్కుం పిక్చర్‌కు." వాడికి చిరంజీవి సినిమాలంటే ఇష్టం. ఫైటింగ్‌సీన్లంటే ప్రాణం. అయినాసరే తండ్రి ఆఫర్‌కు వాడు తల ఆడించలేదు. ఆహా.. అట్లాగే అనలేదు.

అరుంధతే లాలనగా అన్నది. "ఇంటికొచ్చేటప్పుడు ఇంకో మంచి పెన్ను కొనుక్కురండి అది అచ్చంవాడికే! మీరసలు దాన్నసలు ముట్టుకోనే ముట్టుకో గూడదు!"

ఆ మాట వినగానే వాడి కళ్ళల్లో మెరుపు. ఆ మెరుపు చూసిన మూర్తి సంధి చేసుకున్నట్టుగా— "సరే" అన్నాడు.

మూర్తికి ఒక పక్కన కొడుకు జ్ఞాపకం వస్తున్నాడు. మరో పక్కన అరుంధతి. ఇద్దరి మధ్యా తనకు త్రుటిలో తప్పిన యాక్సిడెంట్?? నిజమే. తన అదృష్టం బావుండి, యాక్సిడెంట్ తప్పింది. ఆ ప్రమాదమే జరిగివుంటే— భగవాన్!!! తల్చుకుంటేనే భయం వేస్తోంది. తననో అనాథప్రేతగా అవతలికి తరలించే వాళ్ళు. తన జేబుల్లో తనకు గురించిన చహరా ఏముందీ? పేర్సుకూడా లేదు తన దగ్గర. మూర్తి వేళ్ళు అటూయిటూ కదిలాయి జేబుల్లో. ఓ కాయితం తగిలింది ఆ వేళ్ళకు. బయటకు తీశాడు. కిందటి రోజు పచారీ కొట్టు దగ్గర్నుంచీ తను తెచ్చిన సరుకుల పట్టీ.

కందిపప్పు రెండు కేజీలు. ఓ కేజీ కొట్టేశాడు. "కిందటి నెలకూ ఈ నెలకూ కేజీకి రూపాయిన్నర పెరిగింది. పప్పు ఖర్చు తగ్గించేద్దాం" అన్నాడు తను.

"అట్లాగే" అన్నది అరుంధతి.

పెసరపప్పు రెండు కేజీలు. ఓ కేజీ కొట్టేశాడు. "ఇదీ తగ్గించేద్దాం"

"ఓ.కే. మీ ఇష్టం" అరుంధతి కాదన లేదు.

మినప్పప్పు రెండున్నర కేజీలల్లా ఒకటిన్నరైంది. బెల్లం సహానికి సగం తగ్గింది. చింతపండు చిక్కిపోయింది. 'మిరపకాయల విషయం వచ్చేసరికి "ఒద్దోయ్! మిర్చీ మంచిది కాదు వొంటికి'" అన్నాడు.

"తమ ఇష్టం?"

"ఉప్పు కూడా తగ్గించేద్దాం. అది ప్రెషర్ని పెంచుతుంది!"

అన్నింటికీ తలవూపి తలవూపి చివరకు అన్నది అరుంధతి "సిగరెట్లుకూడా కట్టేనా?"

మూర్తి మాట్లాడలేదు.

"ఓ అరగంట ముందస్తుగా బయలుదేరితే, హాయిగా నడుస్తూ వెళ్ళిపోవచ్చు ఆఫీసుకు. నడక వంటికి ఎంతో మంచింది"

మూర్తి తెల్లమొహం వేశాడు.

"రోజు విడిచి రోజూ గడ్డం చేసుకోడం ఎందుగ్గానీండి, వారానికోసారి చేసుకోండి చాలు,

బ్లేడ్లు ఆదా అవుతాయి. ఇప్పుడు మనకు గడ్డమేమీ అడ్డంకాదుగా?''

మూర్తి గుటకలు మింగాడు. ''యూ ఆర్ టూ క్రూయల్!'' అన్నాడు.

అరుంధతి అతని తల్లోకి వేళ్ళు పోనిచ్చి లాలనగా అన్నది. ''మనవి మధ్యతరగతి బతుకు లండీ! వీటిల్లో కొట్టివేతలూ, దిద్దుబాట్లూ తప్పవన్న సంగతి నాకూతెలుసు. కానీ కడుపు కట్టుకుని, నోరు కట్టేసుకుని, ఎందుకండీ బతకడం? మీ ఒక్కరి సంపాదనా చాలదను కుంటే, నేనూ ఏదో పని చేస్తాను ''

''ఏం చేస్తావుట?''

''నలుగురు ఆడవాళ్ళను పోగేసుకుని అప్ప డాలు, కమ్మసున్ని, వడియాలు— వీటి తయారీ మొదలెడదాను ''

తను అర్ధాంతరంగా కన్నుమూస్తే అంతటి జాలిగుండెగల, అర్ధం చేసుకోగల అర్ధాంగిని తను వీధులపాలు చేస్తాడు.

''టికట్... టికట్... టికట్...!'' కండ క్టరు అరుస్తూ దగ్గరకు వచ్చాడు. మూర్తి రూపాయినోటు అతనికిచ్చాడు.

''మీరేనా 'యాక్సిడెంటునుంచి తప్పించు కుంది! లక్కీసార్!, ఎక్కడకు కొయ్యమం టార్సార్ టిక్కట్!''

''కొవ్వలిక్కాయ్?''

''ఇది కొవ్వలి రూటుబస్ కాదు సార్? అది నంబర్ ఫోర్... ఇది నంబర్ ఫైవ్''

ఒక్కసారి మూర్తి నాలిక్కొరుక్కున్నాడు. ఏమిటివ్వాళ తన మతిమరుపు ఇట్లావుందీ! అనుకున్నాడు. కొవ్వలి... కొవ్వలి... కొవ్వలి ఇంకా తన మనసు మడతల్లో వుందా! తండ్రి చచ్చిపోయాడు. మారుటి తల్లి రాజ్యం వచ్చింది. ఉన్న మూడెకరాలూ తనకే కావాలంటుందామె. సరె అని ఆ మూడెకరాల పల్లం పొలం పంటా ఆమెకే ఇచ్చేసేవాడు. ఉన్నదంతా ఆమెకే ఇస్తుండడం చూసి, ఒకసారి అరుంధతి అన్నది. ''అదేమిటండీ!— మనకూ పిల్లా — జెల్లా ఉన్నారు. మన బాధ్యతలు మనవి. ఆవిడ్నికూడా మనతోనే వచ్చి ఉండమనండి— కలో గంజో తాగుతుంది.''

''ఆ ఖర్మ నాకేం పట్టలేదు?'' అన్నది తన పిన్ని ఖరాఖండిగా. ''ఇది నా మొగుడి ఆస్థి. నేను పెట్టిందే మీరు తినండి?''

''ఆ ఖర్మ మాకూ పట్టలేదు'' అన్నది అరుంధతి అంత మొండిగానూ ''ఇది మా మామగారి ఆస్థి. మా ఆయనకూ ఇందులో హక్కుంది. కన్నకొడుకు తర్వాతే కట్టుకున్న పెళ్ళాం హక్కు?''

దాంతో తన పిన్ని ఆగ్రహోదగ్రురాలైంది. ''మొగుడున్నాడు కదా అని అంత మిడిసిపాటు పనికి రాదు. ఏదో ఒకరోజు దేహీ అని నువ్వు నా దగ్గరకు రాక మానవు ''

''అంతకన్నా వీధిలో నాలుగు కొంపలు అడుక్కుతినైనా కన్నబిడ్డల కడుపు నింపు కుంటాను ''

మూర్తి బస్సుదిగి ఆఫీసుకు వెళ్ళి, ఎటెం డెన్సు రిజిష్టరులో సంతకం పెడుతుండగా, అటెండరు త్రిమూర్తులు అడిగాడు, ''ఏం సార్! ఎప్పుడూ లేంది తవరివాళ అయిదు నిముషాలు లేటుగా వచ్చారే!''

తప్పిపోయిన యాక్సిడెంటు సంగతి చెప్ప కోడం, సానుభూతి సంపాదించుకోవడం ఇష్టం లేక పేలవంగా వో నవ్వు నవ్వి, ''అవును... లేటు... లేటయింది '' అంటూ తన సీటు దగ్గరకు నడిచాడు మూర్తి.

ఎదురుగా దొంతర్లుగా కాయితాలు.

తల్లో కందిరీగల్లా ఆలోచనలు.

తనకే ఆ యాక్సిడెంటు నిజంగా అయి వుంటే?... అప్పుడు... అప్పుడు అరుంధతి పరిస్థితి ఏమైవుండేది...! వీధుల్లో నిజంగానే అడుక్కుని వుండేదా... లేక తన పిన్ని దగ్గరకే పోయి, తలవంచుకుని, దీనంగా, ''క్షమించం డత్తయ్యా, పిల్లలు నకనకలాడి పోతున్నారు, ఆయన ఇట్లా అర్ధాంతరంగా అన్యాయం చేసి పోతారనుకోలేదు. నన్ను చూసి కాకపోయినా, ఈ పసివాళ్ళను చూసైనా నన్ను మీ నీడలో తలదాచుకోనీండి!'' అంటూ కన్నీళ్ళతో ఆవిడ కాళ్ళమీద పడిపోయేదా?

ఉహూ... పడదు గాక పడదు. అరుంధతికి ఆత్మాభిమానం ఎక్కువ. రోజు గడవకపోతే పిల్లల్ని తీసుకుని తనూ, పిల్లలూ ఏ బావిలోనో, గోతిలోనో దూకనైనా దూకుతారు కాని దేహీ అని ఇతరులను యాచించదు. అటువంటి వ్యక్తిత్వంగల మనిషికి తను ఇంతవరకూ జీవితం లో ఏం సుఖాలు అందించినట్లూ! ఆమెకు తను ఏం న్యాయం చేసినట్లూ?

''మూర్తిగారూ, తమను అయ్యగారు పిలుస్తు న్నారు?'' అటెండరు త్రిమూర్తులు పిలిచాడు.



### మందు

ఒక యువతి డాక్టర్ దగ్గరకు కంగారుగా వచ్చింది.


''డాక్టర్! నాకు మతిమరుపు ఎక్కువయింది. అయిదు నిమిషాల క్రితం ఏమయిందో కూడా గుర్తుండడం లేదు. దీనికేమైనా మందిస్తారా?'' అంది.

''ఓ... అలాగే... లోపలి కెళ్ళి బెడ్ మీద పడుకోండి'' అన్నాడు డాక్టర్ ఆవిడ అందానికి మురిసిపోతూ.

—పి.నారాయణరావు (జక్కేపల్లి)

కానిస్టేబుల్

ARUN



అయ్యగారి గదిలో, మూర్తిమీద విసిరి కొట్టాడు ఓ ఫైలు ఆ ఆఫీసరయ్యగారు. "ఏమిటయ్యా నువ్వు టైపు చేస్తున్నదీ! ఆర్ యూ మ్యాడ్? హు ఈజ్ దట్ బ్లడీ అరుంధతీ!"

"షి... షి... ఈజ్ మై బెటర్ హాఫ్, సర్" మెల్లగా తలదించుకుని అన్నాడు మూర్తి. ఫైలు తీసుకుని పైనున్న కాయితంలోకి తొంగి చూశాడు.

"అరుంధతీ!, మై డియర్! ఐ డునాట్ డిజర్వ్ యు? రియల్లీ! ఐ డునాట్ డిజర్వ్ యూ! ఐ యామ్ మేకింగ్ యువర్ లైఫ్ మిజరబుల్! సపోజ్ ఐ డై అన్‌క్స్‌పెక్టెడ్‌లీ" మూర్తి సమాధానంతో కొంచెం చల్లబడ్డ ఆ ఆఫీసరు, "ఐసీ!" అన్నాడు. కళ్ళమీద నుంచి జోడు తీసి తుడిచి మళ్ళీ పెట్టుకున్నాడు. కొంచెం సీరియస్‌గా—

"ఇంట్లో ఏవన్నా పొద్దున్న రామరావణ యుద్ధం జరిగిందా?" అన్నాడు.

"నథింగ్... నథింగ్... సర్!!"

"నో! దేర్ ఈజ్ సంథింగ్! అయినా నాకు తెలీకడుగుతాను, మన దేశంలో ఏ పెళ్ళానికి ఏ మొగుడు తగినవాడూ...? మోస్ట్ హజ్‌బెండ్స్ ఆర్ టిరానికల్...? నువ్వొ అంతేనన్నమాట? డోన్ట్‌వర్రీ! మన పెళ్ళా లందరూ సీతా, అనసూయా, సావిత్రీ వగైరా లకు వారసులు కదా! సాయంత్రం ఇంటికెళ్ళే టప్పుడు ఏ మల్లెపూల పొట్లమో, ఏ జాకెట్ ముక్కో పట్టు కెళ్ళు... దట్సాల్! ఆ మబ్బులు విడిపోతాయి. నీ మొగుడు తనాన్ని నువ్వు మళ్ళీ కాపాడుకోవచ్చు. వెళ్ళు... వెళ్ళు... వెళ్ళి. జాగర్తగా టైపుచెయ్ తప్పులు రానీబోకు. కట్టుకున్నదాని పేరును నలుగురి ముందూ పడేయబోకు"

"అట్లాగేసర్?"

మూర్తి బయటకు వచ్చేసి, టైపు మిషను ముందు కూచుని మళ్ళీ బుద్ధిగా టైపుచేసుకోడం మొదలెట్టాడు. లోపల ఏం జరిగిందో తెలుసు కోవాలని అతని కొలీగ్స్ మహా ఆరాట పడిపో తున్నారు. అయినా అతను ఉలకలేదు. పలక లేదు. కాఫీ టైంలో అతడ్ని టెకిల్ చెయ్య బోయారు. అతను అందుకూ అవకాశం ఇవ్వ లేదు.

"రేపట్నించి ఎక్కడకు వెళ్ళినా ఓ విజి టింగ్ కార్డు కూడా తీసుకు వెళతాను..." అనుకున్నాడు కొంత సేపయింతర్వాత.

విజిటింగ్ కార్డ్ అనుకునేసరికే అతనికి నవ్వు మొలకలెత్తింది. విజిటింగ్ కార్డు బతుకేనా తనది! విజిటింగ్ కార్డులూ, సఫారీ సూట్లూ, అంబాసిడర్ బూట్లు, త్రీ ఫైవ్స్ సిగరెట్లూ, త్రీ ఏ సెస్‌లో వాట్ సిక్స్‌టీనైన్ తలపట్లూ, ఇవి తన బతుక్కు అందవు. తనది సాదా సీదా పేవ్‌మెంట్ బతుకు. కుక్కతోక వంకరబతుకు. కన్నీటి ఉప్పదనం బతుకు. చిరుగుల చొక్కా కుట్టుకుని తొడుక్కునే బతుకు. పదిమందీ ఎగతాళి చేస్తేదాన్నే నవ్వుగా మార్చుకుని బతికే బతుకు. ఏడుపు అనే గాటకు కట్టబడ్డ ఎద్దుబతుకు. తను ఎద్దుసరే, తన భార్యా గానుగెద్దేనా!... తన బిడ్డలూ అంతేనా...! ఆఫీసునుండి బయట పడి నడుస్తున్నాడన్న మాటేకాని మూర్తి ధ్యాసంతా, భార్యాబిడ్డల మీదే వుంది.

ఆఫీసరు తిట్టేనా ఓ మంచి మాటన్నాడు. మల్లెపూల పొట్లం సంగతి రః మధ్యకాలంలో తను మర్చేపొయ్యాడు. అకాల వార్ధక్యం... మనసుకూ, శరీరానికి కూడా? అరుంధతికి మల్లెపూలు... కిష్టిగాడికి పెన్ను... తనకు ఇప్పుడిప్పుడే ముసలితనం రాదు. తన కిష్టిగాడు ఏడవకూడదు. అరుంధతి చెప్పింది నిజమే. కట్స్ గురించి ఆలోచిస్తుంటే, జీవితమే కట్ అయిపోతుంది ఎక్కడో. వద్దు... వద్దు. ఆ ఆలోచనే వద్దు. ఆలోచనల్లో ఉన్న మూర్తి, ఆ ఆలోచనే వద్దనుకుంటూ ఇటు చూస్తే దయ్యం లాగా ఓ ఆర్‌టీసీ బస్సు బొంయ్ మనుకుంటూ మీదిమీదికి వస్తోంది. అటు చూస్తే నో లారీ భూతంలా, కీచుమంటూ అరుస్తూ దూసుకు దూసుకు వచ్చేస్తోంది. వెనగ్గా ఓ ట్రాక్టరు కుయ్యోమ్యోమంటోంది. పక్కన ఓ ఎడ్లబండివాడి చెర్నాకోలు చురుక్కున తగుల్తోంది. మూర్తి కిందపడి పోయాడు. జనం... జనం... గోల... గోల... అయ్యో... అయ్యో... పాపం, ఎవరో ఆయన... మూర్తి చెయ్యి విరగబడిపోయింది. ఆ చేతిలో పూలు నలిగి పొయ్యాయి. మూర్తి జేబులో వున్న పెన్ను నుజ్జునుజ్జు అయిపోయింది. అతని కళ్ళు ఏదో చెప్పాలనుకుంటున్నాయి.... అతని పెదిమలు ఏదో పలకాలను కుంటు న్నాయి... కానీ వినే వోపిక ఎవరికి రః యాక్సిడెంట్ల లోకంలో!!

*



ఏడుస్తారు

"మా నాన్న పోయి పదేళ్లయింది. ఆయన పేరు చెబితే ఇప్పటికీ ఈ ఊళ్ళో వాళ్ళు ఘొల్లున ఏడుస్తారు. తెల్సా?" అన్నాడు వాసు, బోసుతో.

"అలాగా... అంత మంచి మనిషా!" ఆశ్చర్యపోయాడు బోసు.

"కాదు, ఊళ్ళో అందరి దగ్గరా అప్పులు చేసి సడెన్‌గా పోయాడు" అన్నాడు వాసు.

—కె.ప్రసాద్ (గుంటూరు)

వరకట్నానికి

